క్లుప్తంగా

కిశోర వికాసం సమ్మర్ క్యాంపెయిన్ విజయవంతం చేయండి



ఉయ్యూరురూరల్: కిశోర వికాసం సమ్మర్ క్యాంపెయిన్‌ను విజయవంతం చేయాలని ఉయ్యూరు ఎంపీడీవో జీవీఎస్ శేషగిరిరావు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం కిశోర వికాసం సమ్మర్ క్యాంపెయిన్ అవగాహన కార్యక్రమం జరిగింది. సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ బాల్య వివాహాలతో ఎంతో నష్టం జరుగుతుందన్నారు. బాల్య వివాహాలు, లైంగిక వేధింపులు, మానవ అక్రమ రవాణాలను అడ్డుకుంటే సమాజానికి మేలు జరుగుతుందన్నారు. నేటి సమాజంలో బాలికలకు విద్య ఎంతో అవసరమన్నారు. జీవితంలో ఆత్మరక్షణతో పాటు లైంగిక వేధింపులను ఎలా ఎదుర్కోవాలో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో కంకిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ బేబీ సరోజిని, వెలుగు ఏపీఎం అమరేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నియంత్రణకు కలిసిరావాలి



పెద్దఆవుటపల్లి(గన్నవరం): ఉంగుటూరు మండలం పెద అవుటపల్లిలో బుధవారం వాసవ్య మహిళా మండలి ఆధ్వర్యాన బాల్య వివాహాల నియంత్రణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని బ్రదర్ జోసఫ్ తంబి పుణ్యక్షేత్రం, పలు హిందూ ఆలయాలు, చర్చిలకు వెళ్లి బాల్య వివాహాల నియంత్రణకు సహకరించాలని మత పెద్దలను కోరారు. ఈ సందర్భంగా వాసవ్య ప్రతినిధి దొనేల మార్తమ్మ మాట్లాడుతూ.. అక్షయ తృతీయ సందర్భంగా బాల్య వివాహాలు జరగకుండా అవగాహన కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ముఖ్యంగా ప్రజల్లో మూఢ నమ్మకాలను పారదోలి, బాల్య వివాహాలతో కలిగే అనర్థాలను వివరిస్తున్నట్లు చెప్పారు. పలువురు గ్రామ ప్రముఖులు, మత పెద్దలు పాల్గొన్నారు.

పాడిరైతుల సంక్షేమానికి తోడ్పాటు



గోపవరపుగూడెం(గన్నవరం): గోపవరపుగూడెం గ్రామంలో రూ. 5 లక్షలతో నిర్మించిన పాలకేంద్రం భవనం బుధవారం పాడి రైతులకు అందుబాటులోకి వచ్చింది. తొలుత ఈ భవనాన్ని మాజీ ఎమ్మెల్యే దాసరి వెంకట బాలవర్ధనరావుతో కలిసి కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు ప్రారంభించారు. ఈ సందర్భంగా చలసాని మాట్లాడుతూ... పాడి రైతుల సంక్షేమమే లక్ష్యంగా యూనియన్ పని చేస్తోందన్నారు. రైతులు సరఫరా చేసే పాలకు అధిక ధరను చెల్లించడంతో పాటు బోనస్‌ల రూపంలో ఆర్థిక తోడ్పాటునందిస్తున్నట్లు చెప్పారు. యూనియన్ డైరెక్టర్ పలగాని కొండలరావు, పాలకేంద్రం అధ్యక్షుడు నల్లూరి వెంకటశివప్రసాద్, డైరెక్టర్లు చిట్టినేని కోటేశ్వరరావు, తరిగొప్పల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గోసాలలో సీసీ రోడ్లు ప్రారంభం



పెనమలూరు: గోసాల గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద నిర్మించిన పలు సీసీ రోడ్లను ఎమ్మెల్యే బోడె ప్రసాద్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో రూ 82.50 లక్షల ఉపాధి నిధులతో దాదాపు 800 మీటర్ల సీసీ రోడ్ల నిర్మాణాలు చేశామన్నారు. కార్యక్రమంలో సర్పంచి సంగెపు శ్రీనివాసరావు, టీడీపీ మండల అధ్యక్షుడు కోయా ఆనంద్‌ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

భువనేశ్వరి పీఠంలో నూతన భవనానికి శంకుస్థాపన



కేసరపల్లి(గన్నవరం): కేసరపల్లి శివారు శ్రీభువనేశ్వరి పీఠంలో నూతనంగా నిర్మిస్తున్న భవన నిర్మాణ పనులకు బుధవారం ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు శంకుస్థాపన చేశారు. శివపార్వతుల శాంతి కల్యాణం, పూజ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. పీఠాధిపతులు కమలానందభారతిస్వామి, ఆశ్రమం పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కొరవడిన పోలీస్ నిఘా!

'మల్లేశ్వరరావు విజయవాడ వన్‌టౌన్‌లో పనిచేస్తున్నాడు. పనులు ముగించుకుని వణుకూరులోని రాత్రి ఇంటికి వచ్చే సరికి ప్రతి రోజూ అర్ధరాత్రి 12 దాటుతుంది. ఈ క్రమంలో రెండు రోజులు క్రితం ఓ ఆటోలో ముగ్గురు వ్యక్తులు మల్లేశ్వరరావు ద్విచక్ర వాహనాన్ని వెంబడించారు. ఇంతలో అతని ఇల్లు రావడంతో త్రుటిలో ఆకతాయిల దాడి నుంచి తప్పించుకున్నాడు'.

' రాణి పోరంకిలోని ఓ ప్రైవేటు సంస్థలో పనిచేస్తుంది. రాత్రి 11 గంటలు దాటాక గోసాల శివారులో ఉన్న ఇంటికి నడుచుకుంటూ వెళ్తుంటే ఓ ఆకతాయి మద్యం సేవించి ఆమె వెంటపడ్డాడు. అటుగా వెళ్తున్న వ్యక్తులు కేకలు వేయటంతో అతను పరారయ్యాడు.' ఇవి కేవలం రెండు ఉదాహరణలు మాత్రమే. ఈ తరహా ఘటనలు శివారు ప్రాంతంలో నిత్యకృత్యంగా మారాయి.

- శివారు ప్రాంతాలే టార్గెట్
- మద్దూరు, వణుకూరు, గోసాల రోడ్డులో పెట్రేగిపోతున్న ఆకతాయిలు
- బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్న ప్రజలు



వణుకూరులో ఈ తరహా ప్రాంతాలే ఆకతాయిలకు నెలవుగా మారుతున్నాయి

కంకిపాడు: గ్రామాలపై నిఘా కొరవడంతో ఆకతాయిలు శివారు ప్రాంతాలనే వేదికగా చేసుకుని రెచ్చిపోతున్నారు. రాత్రిళ్లు గస్తీ అంతంత మాత్రంగా ఉండటంతో శివారు ప్రాంతాలు, ఖాళీ నివేశన స్థలాలు వెంచర్లు ఆకతాయిలకు కేరాఫ్‌గా మారుతున్నాయి. పెనమలూరు నియోజకవర్గం వ్యాప్తంగా ఉన్న అనేక శివారు గ్రామాలు, నిర్జన ప్రదేశాలు ఆకతాయిలకు చిరునామాగా మారాయి. శివారు ప్రాంతాల్లో ఉన్న ఖాళీ వెంచర్లు, లే అవుట్లను ఆవాసంగా చేసుకుని మద్యం, గంజాయి తాగటం, పేకాటతో పాటుగా మహిళలను తీసుకొచ్చి విచ్చలవిడిగా వ్యవహరిస్తూ అడ్డూ అదుపూ మర్చిపోతున్నారు.

మద్దూరు, గోసాల రోడ్డులోకి రావాలంటే హడలే

నియోజకవర్గంలో కీలకమైనది మద్దూరు, గోసాల రోడ్డు. ఇదేమీ మామూలు రోడ్డు కాదు ప్రజాప్రతినిధులకు కాసుల తెచ్చే రహదారి అని ప్రజలు గుసగుసలాడుకుంటుంటారు. అలాంటి కీలక రహదారి అధ్వానంగా కనిపిస్తోంది.. ఎక్కడ గోతులో ఎక్కడ రోడ్డో తెలీని పరిస్థితి.. ఎలాగో ఆ ప్రాంతం దాటి డొంక రోడ్డులోకి వెళ్తే అటు ఇటు పొలాలు.. కొంత దూరం మేర వీధి దీపాలు లేక చిమ్మచీకటిగా ఉంటుంది పెనమలూరు నియోజకవర్గంలోని మద్దూరు నుంచి గోసాల వెళ్లే రోడ్డు. ఇలాంటి ఘోరమైన రోడ్డులో అసాంఘిక శక్తులు తిష్ట వేయడంతో వాహనచోదకులు, పాదచారుల తిప్పలు వర్ణించలేని పరిస్థితి. దీనికి కారణం.. పోలీస్ నిఘా అసలు కొరవడటమే అని విమర్శలు వస్తున్నాయి. ఈ ప్రాంతంలో పేదలకు ఎక్కువ మంది నివసిస్తున్నారు. ఇక్కడ ప్రభుత్వ లేఅవుట్లు కూడా ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో ప్రజలు వీరి దెబ్బకు హడలిపోతున్నారు.

ఒంటరి వ్యక్తులే టార్గెట్

ఎక్కడ చూసినా రాత్రిళ్లు ఈ ఖాళీ వెంచర్ల నిండా మందుబాబులు, అక్కడ చేసే అల్లర్లు అధికంగా ఉంటున్నాయి. మద్యం మత్తులో సాధారణ జనంపై రెచ్చిపోవడం, దాడులకు తెగబడుతున్నారు. గోసాల సెంటరులోని వంతెన వద్ద మద్యం సేవించిన కొందరు యువత తాము అధికార పక్షానికి చెందిన వారమని, ఎవర్ని కొట్టినా.. ఎవరు ఆపుతారు? అంటూ బహిరంగంగా సవాళ్లు విసిరిన పరిస్థితులు ఉన్నాయంటే అతిశయోక్తి కాదు. అర్ధరాత్రి సమయంలో పనులు ముగించుకుని ఇళ్లకు వెళ్లే ఒంటరి వ్యక్తులను టార్గెట్ చేసి దాడులకు సైతం సమాయత్తమవుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ముఖ్యంగా శివారు ప్రాంతాల్లో ఈ తరహా పరిస్థితులు నెలకొంటున్నాయి. నిఘా ఏర్పాటుచేసి ప్రజలకు భద్రత, భరోసా ఇవ్వాల్సిన పోలీసులు ఆచూకీ ఉండటం లేదు. దీంతో ఆకతాయిల వ్యవహారం అడ్డగోలుగా తయారైంది. పరిస్థితి శ్రుతి మించిన తర్వాత చర్యలకు ఉపక్రమించే దానికన్నా, ముందస్తు భద్రతా చర్యలు చేపడితే భరోసాగా ఉంటుందని పలువురు శివారు ప్రాంత ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

పోలీసులు ఏరీ..

ఈ ప్రాంతంలో గంజాయి బ్యాచ్‌లు, మందుబాబులు పేట్రేగిపోతున్నారు. వ్యసనాలబారిన పడిన వీరు రాత్రి అయితే రోడ్ల మీద రయ్యి రయ్యిన వాహనాలపై తిరుగుతూ, అక్కడ ఉన్న అరుగులపై తిష్ట వేసి ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని పలువురు వాపోతున్నారు. రాత్రి వేళ కొందరు ఆటోల్లో తిరుగుతూ ద్విచక్ర వాహనచోదకులు, పాదచారుల వెంట పడుతూ ఆందోళనకు గురి చేస్తున్నారు. అయితే ఇంత జరుగుతున్నా ఇటు పోలీసుల జాడే కానరావడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఎవరూ బీట్‌కు వచ్చిన దాఖలాలు కానరావడం లేదు. పోలీసులు మద్దూరు, గోసాల రోడ్డు భద్రత పెంచడానికి చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఈ ప్రాంతాల్లో నివసించే పేదలను చిన్నచూపు చూడకుండా ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి మద్దూరు, వణుకూరు, గోసాల రోడ్డులో నిఘా పెంచాల్సి ఉంది.

సర్పంచ్‌పై దాడి అమానుషం

వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి నత్తా వెంకటేశ్వరరావు

కంకిపాడు: కలవపాముల సర్పంచ్ పానుగుమాటి బాలస్వామిపై జరిగిన దాడి అమానుషమని, నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి నత్తా వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. పట్టణంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో బుధవారం ఆయన మాట్లాడారు. గ్రామ సచివాలయం సాక్షిగా మద్యం మత్తులో ఓ వ్యక్తి సర్పంచ్‌పై దాడి చేశాడన్నారు. పోలీసు శాఖ నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. నియోజకవర్గంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలపై పెరుగుతున్న దాడులు హేయమన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి అనుసంధానంగా ఉండే సచివాలయ, వివిధ శాఖల ఉద్యోగులకు తగిన గౌరవంతో పాటు రక్షణ కూడా కల్పించాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. పోలీసులు ఒత్తిళ్లకు తలొగ్గకుండా న్యాయ పరిరక్షణకు పాటుపడాలని ఆకాంక్షించారు.

త్వరలో శ్మశానాల అభివృద్ధి పనులు

రామవరప్పాడు: రామవరప్పాడులోని హిందూ, ముస్లిం శ్మశానాల అభివృద్ధి పనులను త్వరలో చేయనున్నట్లు పంచాయతీ కార్యదర్శి ఘంటా రామ్మోహనరావు తెలిపారు. గ్రామంలోని పీఎస్ఆర్ కాలనీలో బుధవారం అభివృద్ధి చేయాల్సిన శ్మశానాలను స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రామ్మోహనరావు మాట్లాడుతూ పంచాయతీ నిధులు రూ.8 లక్షలతో ముస్లిం శ్మశానం, రూ. 11 లక్షలతో హిందూ శ్మశానం అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఇటీవల నిర్వహించిన పాలకవర్గ సమావేశంలో ఈ శ్మశానాల అభివృద్ధికి తీర్మానించినట్లు వివరించారు. కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో పనులు ప్రారంభం కాలేదని ప్రస్తుతం ఈ ఇబ్బందులు తొలగడంతో త్వరలో నిర్మాణ పనులు ప్రారంభించనున్నట్లు వివరించారు. హిందూ శ్మశానవాటికలో తుది దశలో నిలిచిపోయిన అభివృద్ధి పనులు పూర్తి చేసి గ్రామస్తులకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకొస్తామన్నారు.

గ్రంథాలయాలతోనే విజ్ఞానం

పెనమలూరు: గ్రంథాలయాల్లో విజ్ఞానం కలుగుతుందని వణుకూరు శాఖ గ్రంథాలయ అధికారి ఎస్.భారతి అన్నారు. వణుకూరులో బుధవారం వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. భారతి మాట్లాడుతూ వేసవి శిబిరంలో విద్యార్థులు పాల్గొనాలన్నారు. పుస్తక పఠనం, విద్యార్థుల మానసిక ఆనందం కోసం ఆటలు ఆడించారు. గురువారం క్విజ్ పోటీలు నిర్వహిస్తామన్నారు. పెనమలూరు గ్రంథాలయంలో విద్యార్థులకు మ్యూజికల్ చైర్స్ పోటీ నిర్వహించామని గ్రంథాలయ అధికారి పి.హరీష అన్నారు.



పెనమలూరులో మ్యూజికల్ చైర్స్ ఆడుతున్న విద్యార్థులు

సృజన వెలికితీసేలా శిక్షణ

కంకిపాడు: సృజనాత్మకత వెలికితీసేలా వేసవి శిక్షణ శిబిరాలు సాగుతున్నాయి. మండలంలోని తెన్నేరు శాఖా గ్రంథాలయంలో బుధవారం విద్యార్థులకు చిత్రలేఖనంలో శిక్షణ ఇచ్చారు. అందమైన చిత్రాలు గీసి ఔరా అనిపించారు. కార్యక్రమాన్ని గ్రంథాలయాధికారి ఎస్.సునీత పర్యవేక్షించారు. కంకిపాడు శాఖా గ్రంథాలయంలో కథలు చెప్పడం, వినడం, పుస్తక పఠనం కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాన్ని గ్రంథాలయాధికారి సీహెచ్ రామకృష్ణ పర్యవేక్షించారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం వీరవల్లిలోని గ్రంథాలయంలో చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన వేసవి విజ్ఞాన శిబిరం తరగతులు మూడు రోజులుగా ఉత్సాహంగా సాగుతున్నాయి. బుధవారం మహనీయుల జీవిత చరిత్ర పుస్తకాలను విద్యార్థులకు పరిచయం చేశారు. స్వాతంత్ర్య సమరయోధులు, శాస్త్రజ్ఞులు, ఆధ్యాత్మిక వేత్తల జీవిత చరిత్రలను చదివితే ఎంతో స్ఫూర్తి, ప్రేరణ పొందగలమని గ్రంథాలయ అధికారి పి.స్వర్ణలతాదేవి విద్యార్థులకు వివరించారు. భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి చేరడానికి పుస్తక పఠనం ఎంతగానో దోహదపడుతుందని చెప్పారు. అనంతరం పలురకాల ఇండోర్ గేమ్స్ ఆడించారు.



తెన్నేరు గ్రంథాలయంలో చిత్రలేఖనంలో శిక్షణ పొందుతున్న చిన్నారులు

ముగిసిన గంగానమ్మ తిరునాళ్ల

నున్న(విజయవాడరూరల్): బోడపాడులో శ్రీ గంగానమ్మ దేవస్థానం మూడు రోజుల తిరునాళ్ల మహోత్సవాలు బుధవారం ముగిశాయి. అక్షయ తృతీయ పర్వదినం పురస్కరించుకొని అమ్మవారికి 108 జల బిందెలతో అష్టోత్తర శత ఘటాభిషేకం నిర్వహించారు. నున్నలోని శ్రీ కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయం నుంచి భక్తులు మేళతాళాలతో ఊరేగింపుగా 108 జల బిందెలను తీసుకువచ్చారు. అనంతరం పంబళ్ళవారు శ్రీ గంగానమ్మ జీవిత చరిత్రను ఆలపించగా, మహాకుంభ నివేదన, బోనాల సమర్పణ, మహా పూర్ణాహుతితో మూడు రోజుల తిరునాళ్ల మహోత్సవాలు ముగిశాయి. మధ్యాహ్నం వేలాది మందికి ఆలయ కమిటీ నిర్వాహకులు అన్న సమారాధన చేశారు. పూజలను మొత్తం ఆలయ ప్రధానార్చకుడు వేణుగోపాల్‌స్వామి, అర్చకుడు గురవయ్య ఆధ్వర్యంలో బ్రహ్మర్షి మేడూరి సాయి పవన్ కిషోర్ నిర్వహించారు. ఆలయ కమిటీ కార్యదర్శి విజయలక్ష్మి, సభ్యులు తెనాలి లక్ష్మణరావు, పెయ్యల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



జల బిందెలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

శ్రీనివాసునికి చందనోత్సవం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వైశాఖ శుద్ధ తదియ అక్షయ తృతీయను పురస్కరించుకుని చిట్టినగర్‌లోని శ్రీ పద్మావతి, గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. అక్షయ తృతీయను పురస్కరించుకుని స్వామివారికి 54 కేజీల చందనంతో విశేషంగా అలంకరించారు. తెల్లవారుజామున స్వామివారికి సుప్రభాతసేవ అనంతరం స్వామివారిని విశేష అలంకరణ, పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకులు వినుకొండ రామరత్నమాచార్యులు నిర్వహించారు. అనంతరం స్వామి వారిని పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకుని తరలించి ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. సాయంత్రం పంచహారతుల సేవ, ఏకాంత సేవలను నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు లింగిపిల్లి అప్పారావు, మరుపిళ్ల హనుమంతరావు, కోశాధికారి పిల్ల శ్రీనివాసరావు, ఇతర కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



చందనోత్సవంలో శ్రీశ్రీనివాసుడు

భక్తులకు మజ్జిగ పంపిణీ

సింహాచల అప్పన్న స్వామి చందనోత్సవాన్ని పురస్కరించుకుని చింతలపూడి సత్యనారాయణ ఆధ్వర్యాన మజ్జిగ పంపిణీ జరిగింది. కేటీరోడ్డులో ఏర్పాటు చేసిన చలివేంద్రం వద్ద జరిగిన మజ్జిగ పంపిణీలో చింతలపూడి సత్యనారాయణ, నల్లబిల్లి కనక, గుండు జితేంద్ర, పల్నాటి ఆది తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ



గన్నవరం: గాంధీబొమ్మ సెంటర్‌లో బుధవారం యువత స్వచ్ఛందంగా ముందుకువచ్చి ప్రజలకు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. గన్నవరానికి చెందిన మేడవరపు శిరీష, గంపా రాజేష్ ఆర్థిక సౌజన్యంతో ఈ కార్యక్రమం చేపట్టారు. నానాటికి పెరుగుతున్న ఎండల తీవ్రత దృష్ట్యా ప్రజలకు చల్లటి మజ్జిగ పంపిణీ చేసినట్లు రాజేష్ తెలిపారు. గ్రంథాలయ పాఠకులు యారం లీలారామ్, గోగులమూడి రత్న, బండపల్లి శివరాం, డేరంగుల రాజా, రాచేటి ప్రశాంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాల్యం నుంచే సత్ప్రవర్తన, దైవభక్తి పెంపొందించాలి

హనుమాన్‌జంక్షన్ రూరల్: చిన్నతనం నుంచే తల్లిదండ్రులు సత్ప్రవర్తన, దైవభక్తి పెంపొందించాలని పాస్టర్ ప్రసన్నకుమార్ అన్నారు. స్థానిక ఇందిరానగర్‌లోని బేతేలు ప్రార్థనా మందిరం ఆధ్వర్యాన గత వారం రోజులుగా నిర్వహించిన వేసవి విరామ బైబిల్ పాఠశాల ముగింపును పురస్కరించుకుని బుధవారం హనుమాన్‌జంక్షన్‌లో ప్రదర్శన నిర్వహించారు. ఆట, పాటల ద్వారా చిన్నారులకు ఆధ్యాత్మికత, మానవత్వ, నైతిక విలువలపై శిక్షణ ఇచ్చినట్లు పాస్టర్ ప్రసన్నకుమార్ తెలిపారు. దాదాపు 500 మంది చిన్నారులు వేసవి శిబిరంలో పాల్గొని ఈ కోర్సును అభ్యసించినట్లు చెప్పారు. అనంతరం హనుమాన్‌జంక్షన్ ప్రధాన రహదారుల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రధాన కూడలిలో మానవహారం ఏర్పాటు చేశారు. సంఘ పెద్దలు ప్రకాష్, సత్యనారాయణ, సాంబయ్య, కరుణాకర్, జోసఫ్ పాల్గొన్నారు.



హనుమాన్‌జంక్షన్‌లో చిన్నారుల ప్రదర్శన

50 మంది విద్యార్థులకు సైన్స్ వైజ్ఞానిక శిక్షణ



శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసిన డీవైఈవో పద్మారాణి, దాత శివకుమార్

పెనమలూరు: పెనమలూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో అటల్ బూట్ క్యాంప్‌లో 50 మంది విద్యార్థులు సైన్స్ వైజ్ఞానిక శిక్షణ పూర్తి చేశారని డీవైఈవో ఐ.పద్మారాణి తెలిపారు. బుధవారం శిక్షణ పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేసి ప్రసంగించారు. పాఠశాలలో రెండు రోజులుగా అటల్ క్యాంపులో 50 మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చి వారిలో నైపుణ్యం పెంచడానికి చర్యలు తీసుకున్నామన్నారు. విద్యాదాత పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ కిలారు శివకుమార్ మాట్లాడుతూ అటల్ బూట్ ల్యాబ్ శిక్షణలో విద్యార్థులకు సైన్స్ పరిశోధనలపై విద్యార్థులకు విలువైన మెలకువలు నేర్పామన్నారు. విద్యార్థులకు బహుమతులు ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వై.దుర్గాభవాని, విజయవాడ నీడ్స్ టుయు సమన్వయకర్త కిలారు నాగశ్రవణ్, ఎంఈఓ శేషగిరిరావు, యూనిసెఫ్ ప్రతినిధి టి.సుదర్శన్, సమగ్ర శిక్ష అధికారి డి.మాధవీలత తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి

విజయవాడ కల్చరల్: తెలుగు కళావాహిని, శ్రీ కళాభారతి, పోలవరపు కోటేశ్వరరావు సాహితీపీఠం, జీఆర్‌కే సంస్థల ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానందం కళావేదికమీద బుధవారం నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. మల్లాది స్వాతి, వడ్డాది కామేశ్వరి, దుర్గాప్రసాదరావు, కె.డేవిడ్‌రాజు, అయ్యప్పన్, మస్తాన్‌వలీ, మధుసూదన్, జోసఫ్ తదితరులు పలు తెలుగు, హిందీ చిత్రగీతాలను ఆలపించారు. తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు మాట్లాడుతూ లలిత కళలతోనే మనో వికాసం కలుగుతుందని చెప్పారు. రాగలహరి నిర్వాహకుడు మీరాకుమార్ గాయనీ గాయకులను అభినందిస్తూ ప్రసంగించారు. గోళ్ళ నారాయణరావు, సాహితీవేత్త ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు పనుల పరిశీలన

గన్నవరం: గన్నవరం–ఆగిరిపల్లి ఆర్‌అండ్‌బీ రోడ్డు విస్తరణ నిమిత్తం స్థానిక గాంధీబొమ్మ సెంటర్ నుంచి పోలీస్‌స్టేషన్ వరకు ఆక్రమణలు తొలగించినట్లు తహసీల్దార్ కె.వెంకటశివయ్య తెలిపారు. రహదారి ఆక్రమణల తొలగింపు పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. గతంలో 50 అడుగులు ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డు ఆక్రమణల తొలగింపు తర్వాత వంద అడుగులకు పెంచినట్లు చెప్పారు. ఎమ్మెల్యే సూచనతో మహాత్మాగాంధీ పాత విగ్రహం స్థానంలో కొత్త కాంస్య విగ్రహం ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. మాజీ ప్రధాన మంత్రులు జవహర్‌లాల్‌నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ విగ్రహాలను తొలగించి తహసీల్దారు కార్యాలయ జంక్షన్‌లో సెంట్రల్ డివైడర్‌పై ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు అగ్ని ప్రమాదాలను నిరోధించడానికి ఆర్ ఎస్ బ్రదర్స్ మాల్, సౌత్ ఇండియా షాపింగ్ మాల్, ఏలూరు రోడ్, వీ9 క్లోతింగ్ షోరూమ్, లెనిన్ సెంటర్‌లోని చందనా బ్రదర్స్ షో రూమ్‌లలో వీఎంసీ అగ్నిమాపక సిబ్బంది అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

అగ్ని ప్రమాదం జరగకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన నిరోధక చర్యలు, పరికరాలను ఉపయోగించే విధానం, మంటలను ఎలా అర్పాలి, ఫైర్ స్ప్రింక్లర్స్, స్మోక్ డిటెక్టర్స్, ఎక్కడెక్కడ అమర్చాలి, వాటి వలన స్మోక్ అలారం ఎలా వస్తుంది, అగ్ని ప్రమాదం జరగకుండా కాంప్లెక్స్ చుట్టూ ఫైర్ సేఫ్టీ మెజర్స్ ఏమేం ఉండాలి వంటి విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రీజినల్ ఫైర్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ మాల్యాద్రి, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ రాజా సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న వీఎంసీ ఫైర్ సిబ్బంది

ఘనంగా జీవీఆర్ కళాశాల వార్షికోత్సవం

విజయవాడ కల్చరల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ నృత్య సంగీత కళాశాల 65 వ వార్షికోత్సవం సంగీత కళాశాలలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ పర్యవేక్షణలో విద్యార్థులు ప్రదర్శించిన కూచిపూడి, భరతనాట్యం అంశాలు ఆకట్టుకున్నాయి. సంగీత విభాగానికి సంబంధించిన విద్యార్థినులు దేశ భక్తి గీతాలను వయోలిన్ విభాగం వారు వయోలిన్ మీద వాగ్గేయకార కృతులను ఆలపించారు. వీణా విభాగం వారు వీణపై త్యాగరాజ కృతులను ఆలపించారు. 700 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ కె.లక్ష్మీనరసమ్మ మాట్లాడుతూ సంగీత కళాశాల 67 సంవత్సరాలుగా విలువలతో కూడిన విద్యను అందిస్తోందని చెప్పారు. కళాశాలలో సంగీతం అధ్యయనం చేసిన వారు దేశ విదేశాల్లో కచేరీలు నిర్వహిస్తూ సంగీత కళాశాల పేరును జాతీయస్థాయికి తీసుకెళ్లినట్లు తెలిపారు. వయోలిన్ విద్వాంసుడు గండూరి శ్రీనివాస మూర్తిని ఆత్మీయంగా సత్కరించారు.



గండూరి శ్రీనివాసమూర్తిని సత్కరిస్తున్న నిర్వాహకులు

కంకిపాడుకు విచ్చేసిన ప్రముఖులు



కంకిపాడు: మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు కుమారుడు నిహార్, నర్మద దంపతుల వివాహ వేడుక కంకిపాడులోని అయానా ఫంక్షన్ హాలులో బుధవారం జరిగింది. వేడుకకు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వేడుకల్లో మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణ, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, సీఎం చంద్రబాబునాయుడు సతీమణి భువనేశ్వరి, పలువురు రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు తదితరులు పాల్గొన్నారు.

అభ్యర్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

పటమట(విజయవాడతూర్పు): డీఎస్సీ అభ్యర్థులు ఉపాధ్యాయ కొలువు సాధించి ఉన్నతంగా సమాజాన్ని తీర్చిదిద్దాలని సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారి కేఎస్ శిరోమణి అన్నారు. సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని మురళి ఫార్చ్యూన్ హోటల్ సమీపంలోని ప్రతిభ కోచింగ్ సెంటర్‌లో ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచితంగా డీఎస్సీ శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన స్టడీ మెటీరియల్‌ను అందించారు.